అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు

- అర్హతే ఆధారంగా పథకాలు అందిస్తున్నాం
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ఆశీర్వదించండి
- ఎస్ఎస్బీ పేట గడప గడపలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


పిచ్చాటూరు: బంగారునాయుడు కండ్రిగలో బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీ పేట సచివాలయ పరిధిలోని హనుమంతాపురం, బంగారునాయుడు కండ్రిగ, శ్రీరామాపురం ఎస్ఎస్‌బీ పేట గ్రామం, హరిజనవాడ, ఎస్టీ కాలనీలో గడపకడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బంగారు నాయుడు కండ్రిగ జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సమస్యలపై వినతులు.. పరిష్కారానికి ఆదేశాలు

శ్రీరామాపురంలో బస్సుషెల్టర్ నిర్మించాలని, పీపీ రోడ్డు నుంచి హరిజనవాడ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆదిమూలంకు విన్నవించారు. తోపు హరిజనవాడలో వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని కోరారు. బంగారునాయుడు కండ్రిగలో తాగునీటి బోరు, మోటారు బిగించి దాహార్తిని తీర్చాలని విజ్ఞప్తి చేశారు. హనుమంతాపురంలో గతంలో నిర్మించిన ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. గ్రామాల్లో అక్కడక్కడ ఇంటి పట్టాలు ఇప్పించాలని, జగనన్న ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు సావధానంగా విన్న ఎమ్మెల్యే తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దామోదర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు విష్ణుకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి రిపసూదన్ రావు, సర్పంచ్‌లు కె.రాణి, డి.మనోహరన్, అన్నాదురై, సతీష్, ఎంపీటీసీ సభ్యులు తామరైశెల్వి, శోభన్, రమేష్ రాజు, వేలు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, నాయకులు ఏసు, భూపతి, చలపతిరాజు, కిరణ్‌కుమార్, గోవిందన్, మోహన్, సుబ్రమణ్యం, బాబు రెడ్డి, శేఖర్, చెంగ్రాయ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


గనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

జేబీఆర్ కుటుంబానికి ప్రముఖుల పరామర్శ


కారణిలో జేబీఆర్ మునిరత్నంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, నాయకులు


కమలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విప్ శ్రీనివాసులు, నటుడు సుమన్

పిచ్చాటూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం కుటుంబాన్ని గురువారం సినీ, రాజకీయ ప్రముఖులు నాగలాపురం మండలం కారణిలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. గత నెల 22న మునిరత్నం తల్లి కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. గురువారం ఆమె కర్మక్రియలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరుముట్ల శ్రీనివాసులు, సినీనటుడు సుమన్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు జేబీఆర్ ఇంటికి చేరుకుని కమలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాఘవరెడ్డి తెలిపారు. మూడు రోజులుగా విష జ్వరాలతో బాధపడుతున్న మండలంలోని మోదుగులపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు గురువారం ఏర్పేడు పీహెచ్‌సీలో చికిత్స పొందారు. బుధవారం సర్పంచ్ జయరామయ్య ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. జ్వరాలు తగ్గకపోవడంతో పలువురు పీహెచ్‌సీలో చికిత్స చేసుకున్నారు. వైద్యాధికారి సూచనల మేరకు గురువారం గ్రామంలోని మురుగునీటి కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, కొళాయిల వద్ద మొలాథిన్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సూర్యనారాయణ వంశీ, పంచాయతీ కార్యదర్శి షఫీ, సీహెచ్ఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, ఏఎన్ఎం కామాక్షి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు పళ్లికొండేశ్వరాలయంలో సుమంగళి పూజ

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం సుమంగళి పూజ నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. చైత్ర మాసం, పౌర్ణమి తిథి, స్వాతీ నక్షత్రం సాయంత్రం 5 గంటలకు ఆలయంలోని శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి సన్నిధిలో సుమంగళి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరుగనున్న పత్ర పుష్పయాగానికి గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవ కలశ స్థాపన చేశారు. శుక్రవారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు సోమస్కంద మూర్తి, కామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 10 నుంచి 12 గంటల వరకు పత్రపుష్పయాగ మహోత్సవంలో భాగంగా వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరిలో గాది మునెమ్మ కుటుంబానికి గురువారం సిపాయి భరోసా అందజేశారు. గత నెల 26న మునెమ్మ(54)మృతి చెందింది. గురువారం మృతురాలి కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. సిపాయి భరోసా పథకం కింద ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులు అందజేసి సుబ్రమణ్యం మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు, మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దశరథరామిరెడ్డి, మునిచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సేవలు అందించండి

నారాయణవనం: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలను సకాలంలో అందించడానికి కృషి చేయాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని భీమునిచెరువు సచివాలయాన్ని సర్పంచ్ మురుగేశంతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను, ఇతర సేవలను వెంటనే అందించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరంలో ఇబ్బందులు లేకుండా సకాలంలో సర్టిఫికెట్లను అందించాలని సూచించారు. డ్రాపౌట్లను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. సచివాలయ కార్యదర్శి లీలావతి పాల్గొన్నారు.

ఆగమోక్తంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి


లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం,


ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భక్త కన్నప్పకొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జయంతి వేడుకలను గురువారం ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి కలశస్థాపన, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ జలాలు, కలశ జలాలతో అభిషేకాలు చేసి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు నాగభూషణం, హరియాదవ్, దక్షిణామూర్తి, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, వేదపండితులు అర్ధగిరి, పరిచారకులు దర్బా తులి, రాకేష్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా వెంగమాంబ జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి భక్తురాలు వెంగమాంబ తన సాహిత్యం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను విస్తరింపజేశారని పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో గురువారం వెంగమాంబ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆచార్య యువశ్రీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ – జీవన గానం అనే అంశంపై ప్రసంగించారు. వెంగమాంబ రచనల్లో మహిళలకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. ప్రతి స్త్రీ వెంగమాంబ తత్వాన్ని అలవర్చుకుంటే సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సారకాయల కృష్ణారెడ్డి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ– దాన శాసనాలు అనే అంశంపై మాట్లాడారు. వెంగమాంబ 18 రచనలు చేయగా శ్రీ వేంకటాచల మహత్యం గ్రంథం చిరస్థాయిగా నిలచిపోయిందన్నారు. ఎస్వీ మ్యూజియం ఎస్‌డీవో కృష్ణారెడ్డి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ -సాహిత్యం -ప్రత్యేకత అనే అంశంపై ప్రసంగించారు. సాయంత్రం తిరుపతికి చెందిన శ్యాంకుమార్, తేజోవతి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి ఆకట్టుకుంది.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో సారకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో వైశాఖ పౌర్ణమి పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. స్థానిక సారకాయల స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అలాగే కైలాసనాథకోనలోని కంచి ఆశ్రమం, శాంతి ఆశ్రమం, శివశక్తి ఆశ్రమాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమాల నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

క్లుప్తంగా

బీఎన్‌కండ్రిగలో ట్రాఫిక్ ఇక్కట్లు


బుచ్చినాయిడుకండ్రిగ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కారణంగా ఆగిపోయిన వాహనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. పలువురు ఆటోవాలాలు ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెడుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ సమయంలో ట్రాఫిక్‌లో చిక్కుకుని వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు గడప గడపకు..

వరదయ్యపాళ్యం: మండలంలోని మరదవాడ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మరదవాడలో ప్రారంభమై అయ్యవారిపాళ్యం వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వైద్య పరికరాల అందజేత


వైద్య పరికరాల కిట్లును అందజేస్తున్న కంపెనీ ప్రనితినిధులు

తడ: స్థానిక సబ్ సెంటర్ పరిధిలోని పీహెచ్‌సీలకు గురువారం రూ.30 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను శ్రీసిటీలోని మోండలేజ్ చాక్లెట్ కంపెనీ అందజేసింది. సబ్ సెంటర్ పరిధిలోని తడ, వరదయ్యపాళెం, చిన్నపాండూరు, దాసుకుప్పం, నాగలాపురం, బీఎన్ కండ్రిగ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు శ్రీసిటీలోని మోండలేజ్ చాక్లెట్ కంపెనీ సహకారంతో సేవ్ ది చిల్డ్రన్ హెల్త్ సిస్టమ్ స్ట్రెత్ నింగ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తడలో ఈ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ వికాస్, ప్లాంట్ డైరెక్టర్ అమిత్‌జైన్, సర్పంచ్ ఆర్ముగం, ప్రాజెక్ట్ డైరెక్టర్ జతిన్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

పాండురంగస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట శ్రీపాండురంగ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేదపారాయణం జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారికి పలు రకాల అభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరుగనుంది.

అన్నదాన పథకానికి రూ.10 లక్షల విరాళం

తిరుమల: టీటీడీ అన్నదాన పథకానికి తిరుమల దుకాణదారులు రూ.10 లక్షలు విరాళాన్ని ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. తిరుమలకు వెళ్లే ఏడో మైలు ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుకాణదారులు 2014 వరకు అన్నదానం నిర్వహించేవారు. అది ఆగిపోవడంతో అన్నదానం చేసే డబ్బులను గురువారం దుకాణదారులు రఘు, మునికృష్ణ తదితరులు ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

చోరీపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పాగాలి గ్రామంలో ఓ ఇంటిలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. మార్చి 13న మండలంలోని పాగాలి గ్రామానికి చెందిన కందాటి రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో కలిసి వ్యవసాయ పొలాల్లోని మామిడి తోట వద్దకు వెళ్లారు. ఇదేఅదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు తెరచి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో బెడ్‌రూమ్‌లో దాచిన 24 గ్రాముల బంగారు గొలుసు, 15 గ్రాముల నల్లపూసల దండ, 27 గ్రాముల బంగారు ఉంగరం, 19.8 గ్రాముల బంగారు బొందారం మొత్తం 61.5 గ్రాముల బంగారు నగలను అపహరించారు. వీటి విలువ రూ.1,84,500 ఉంటుందని సీఐ చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మృగరాజుపై చెన్నకేశవుని అభయం


సింహ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారు సింహ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు బాలశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ గున్నేరి నీలకంఠారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

కాలువల్లో మురుగు తొలగింపు



కంచనపుత్తూరు కాలువల్లోని మురుగును తొలగిస్తున్న కూలీలు, జీఎన్‌కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు, జీఎస్‌కండ్రిగ గ్రామాల్లో గురువారం గ్రామ కార్యదర్శులు శివకుమార్, ఇందిరమ్మ పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టారు. గ్రామం, దళితవాడల్లో డ్రైనేజీ కాలువల్లోని మురుగును కూలీలతో తొలగించారు. అదేవిధంగా వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధికాకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో డ్రైనేజీల్లోని మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించి, మురుగునీటి నిల్వ లేకుండా చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వరి సాగుకు సన్నద్ధం


వరినాట్లకు సిద్ధం చేసిన పొలాలు

తొట్టంబేడు మండలంలో వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. చియ్యవరం, బోడవరం, కాసారం, పెద్దకనపర్తి, చిన్న కనపర్తి, బోనుపల్లె, కొన్నలి, సిద్దిగుంట, గుండెలుగుంట తదితర గ్రామాల్లో రైతులు నాట్లు వేస్తున్నారు. వేసవిలో కూడా అకాల వర్షాలు కురవడంతో రైతులు సంతోషంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. తెలుగుగంగ కాలువలో నీరు పుష్కలంగా ఉండడంతో సమీప ప్రాంత రైతులు వేరుశనగ, వరినాట్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. –తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్)

పళ్లికొండేశ్వరుని సేవలో సినీనటుడు సుమన్


నాగలాపురం: పళ్లికొండేశ్వరాలయంలో ప్రదక్షిణ చేస్తున్న సినీ నటుడు సుమన్

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వస్వామివారిని సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన సుమన్‌కు ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు ఆలయంలో కొలువుదీరిన స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగ అమ్మవారు, దాంపత్య దక్షిణామూర్తి, శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సుమన్‌కు చైర్మన్ ఆలయ మర్యాదలు చేయగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు.

నారాయణవనం: సినీనటుడు సుమన్ బుధవారం పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పుత్తూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు అపరంజితో కలిసి ఆలయానికి చేరుకున్న సుమన్‌ను ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆహ్వానించారు. వెంకన్న, పద్మావతీ అమ్మవార్లను దర్శించుకున్న సుమన్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్థానికులు ఆలయం వెలుపల సుమన్‌తో సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల నాయకులు రమేష్ శాలువ కప్పి సత్కరించారు.

అగస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం


ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉదయం కైలాసనాథకోనలో త్రిశూలస్నానం నిర్వహించారు. తిరుచ్చి వాహనంపై ట్రాక్టర్‌లో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లు, త్రిశూలాన్ని ఊరేగింపుగా వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కైలాసకోనకు వేంచేపు చేశారు. అక్కడ తిరుమంజనం అనంతరం జలపాతంలో త్రిశూలానికి స్నానం చేయించారు. సాయంత్రం ఆలయంలో ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుడి చిత్రపట వస్త్రాన్ని అర్చకులు అవరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ అధికారులు నాగరాజు, భరత్, జమేదార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.